# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 23 డిసెంబరు, 2025 | పేజీలు : 08


## ప్రజాసేవే పరమావధిగా పని చేయాలి

### ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ప్రజాసేవే పరమావధిగా పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తీగారం గ్రామ నూతన సర్పంచ్‌గా బేతి కుమారస్వామి, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరు ఐక్యంగా, సమన్వయంతో పని చేస్తే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గ్రామాలలో తాగునీటి, అంతర్గత సీసీ రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టత, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు వంటి పలు అంశాలకు అధిక ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు చిత్తశుద్దితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతంలో మాక్ ఎక్సర్సైజ్ పర్యవేక్షణ

### కలెక్టర్ డాక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్ :** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) జారీ చేసిన ఆదేశాల మేరకు వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతంలో ఒకే సారి వర్షాలు, వరదలు లాంటి విపత్తులు సంభవించిన జిల్లా యంత్రాంగం ఎలా స్పందించాలి, సహాయక చర్యలు ఎలా సమన్వయంతో నిర్వహించాలి అనే అంశాలపై మాక్ డ్రిల్ సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను సోమవారం వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతంలో, నవయుగ కాలనీలలో ఏకకాలంలో నిర్వహించారు. నిరంతర భారీ వర్షాల కారణంగా వరదలు, చెరువులు నిండిపోవడం, రహదారులు దెబ్బతినడం, ప్రజలు, పశువులు నీటిలో చిక్కుకుపోవడం, కాలనీలు నీటమునగడం వంటి విపత్తు పరిస్థితులను ఊహించి ఈ అభ్యాసం చేపట్టబడింది. ముఖ్యంగా చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతంలో, నవయుగా కాలనీ తదితర ప్రాంతాలలో వరద పరిస్థితులను సృష్టించి, వాటికి సంబంధించిన సహాయక చర్యలను ప్రత్యక్షంగా అమలు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డ్రిల్ సాధారణ పరిశీలకులు గద్వాల డీఎఫ్ఓ అశోక్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిసిపి అంకిత్, ఏసీపీ శుభం, వరంగల్ ఆర్డీవో సుమా, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి తో పాటు సహాయక చర్యల మాక్ డ్రిల్ పర్యవేక్షించారు. వర్షాల వలన వరదలు సంభవించి చెరువు నిండి నీటి ప్రవాహంలో చిక్కుకున్న పశువులను, నీటిలో మునిగి కొట్టుకు పోతున్న వ్యక్తిని, నీటి లో చిక్కుకు పోయిన వ్యక్తులను రక్షించేందుకు సహాయక చర్యల్లో అగ్నిమాపక శాఖ నుండి 35 మంది, పోలీస్ శాఖ నుండి 35 మంది, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది 12 మంది, ఆపదమిత్ర వాలంటీర్లు 30 మంది, ఇతర శాఖల అధికారులు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయం తో రక్షణ సహాయక చర్యలు మాక్ డ్రిల్ చేపట్టారు. కలెక్టర్ మాక్ డ్రిల్‌ను స్వయంగా పర్యవేక్షిస్తూ దగ్గరుండి నిర్వహించారు. వరద నీటితో ముంపునకు గురైన నవయుగ కాలనీలోని ఇళ్ల నుండి ప్రజలను ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు రోప్ తాళ్లు, బోట్లు, స్ట్రెచర్ల సహాయంతో మహిళలు చిన్నారులు, వృద్ధులను రెస్క్యూ బృందాలు కాపాడాయి. వరదల్లో చిక్కుకున్న వారిని సహాయక బృందాలు అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలను సాగించారు. వరద నీటిలో ముంపునకు గురైన బాధితులు ఇళ్లపైకి చేరగా వారికి ఆహార ప్యాకెట్లతోపాటు నీళ్ల సీసాలను డ్రోన్ల సహాయంతో అందించారు. వరద నీటిలో చిక్కుకున్న ఒక్కొక్క ఇంటికి రెస్క్యూ బృందాలు చేరుకొని వారికి ధైర్యం చెబుతూ సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. వరదల్లో నీట మునిగిన ఇండ్లలో ని ప్రజలకు డ్రోన్ల సహాయంతో మంచినీటి బాటిల్స్, మందులు, నిత్యావసరాలు అందించారు. వరద ముంపు నుండి బయటికి తీసుకు వచ్చిన ప్రజలను పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. లైఫ్ బోట్, లైఫ్ జాకెట్, స్ట్రెచర్, రోప్ తాళ్ల సహాయంతో సహాయక చర్యలను రెస్క్యూ బృందాలు సాగించారు. చిన్న వడ్డేపల్లి చెరువు వరద నీటిలో కొట్టుకుపోతున్న వారిని లైఫ్ బోటుతో రెస్క్యూ బృందం సభ్యులు కాపాడారు. బాధితులకు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన వైద్య సహాయం కోసం సమీపంలోని దేశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనంలో తరలించారు. అదేవిధంగా వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న పశుసంపదను రెస్క్యూ బృందాలు రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. విపత్తుల సమయంలో అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్డీవోలు ఉమారాణి, సుమ, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, విద్యుత్ ఎస్ ఈ గౌతమ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వరదలు విపత్తుల వంటి సమయంలో సమన్వ యంతో సహాయక చర్యలు చేపట్టా లని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) ఆదేశాల మేరకు సోమవారం మోరంచపల్లి వాగు పరిధిలో వరదల వంటి విపత్తులు సంభవించినప్పుడు తీసుకో వాల్సిన రక్షణ చర్యలపై సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాల కారణంగా వరదలు రావడం, వాగులు ఉప్పొంగడం, ప్రజలు, పశువులు నీటిలో చిక్కుకుపోవడం వంటి విపత్తు పరిస్థితుల్లో ప్రజలను, పశువులను కాపాడేందుకు ముందస్తు అవగహన కార్యక్రమం మాక్ డ్రిల్ ఎంతనానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. వరదల సమయంలో జిల్లా యంత్రాంగం తక్షణమే ఎలా స్పందించాలి, వివిధ శాఖలు సమన్వయంతో సహాయక చర్యలను ఎలా అమలు చేయాలి అనే అంశాలపై ప్రత్యక్షంగా ప్రదర్శించారు. మోరంచపల్లి వాగులో వరద ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తులను, పశువులను సురక్షితంగా రక్షించే విధానాలు, నీటిలో కొట్టుకుపోయిన వారిని గుర్తించి బయటకు తీసుకురావడం, అవసరమైతే పరిసర కాలనీలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. అలాగే అత్యవసర సేవలు తదితర అంశాలను వివరించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖ పాల్గొని సహాయక చర్యలను విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆశోక్ కుమార్, విజయలక్ష్మి, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆర్డిఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్, పశు సంవర్ధక శాఖ అధికారి డా॥ కుమారస్వామి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా॥ మధుసూదన్, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణి ప్రసాద్, ఈడీఎం శ్రీకాంత్ వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాక్ డ్రిల్‌ను పరిశీలించిన

# మేయర్, ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రెస్క్యూ బృందాలు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టే సహాయక చర్యలపై సోమవారం హనుమకొండ లోని సమ్మయ్య నగర్, రెడ్డిపురంలలో మాక్ ఎక్సర్సైజ్ ను నిర్వహించారు. వరదలు సంభవించినప్పుడు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించడం, అక్కడ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వివిధ సదుపాయాలను కల్పించడం వంటి ప్రక్రియను రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం( ఎస్‌డిఆర్ఎఫ్), అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు మాక్ ఎక్సర్సైజ్ లో సహాయక చర్యలను చేపట్టారు. మాక్ ఎక్సర్సైజ్ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగింది. మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు సంబంధించి సమ్మయ్య నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఎస్డిఆర్ఎఫ్, అగ్నిమాపక, ఎన్సిసి, రెడ్ క్రాస్, మున్సిపల్, ఇతర శాఖల సిబ్బందికి వరద సహాయక చర్యలను చేపట్టే వివిధ అంశాలను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి వివరించారు. ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి రవి చౌహాన్ ఆధ్వర్యంలో ఎస్డిఆర్ఎఫ్ రెస్క్యూ బృందం సహాయక చర్యలను నిర్వహించారు. సమ్మయ్య నగర్ లో నిర్వహిస్తున్న మాక్ ఎక్సర్సైజ్ ను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ రవీందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఏసీపీలు నరసింహారావు, సత్యనారాయణ, రెడ్ క్రాస్ ఈసీ మెంబర్ ఇవి శ్రీనివాసరావు, ఇతర అధికారులు సహాయక చర్యలను పరిశీలించారు. మాక్ ఎక్సర్సైజ్ ను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహిస్తుండగా ప్రజలు ఆసక్తిగా గమనించారు.

## చంద్రుగొండ సర్పంచ్‌గా బక్కి కవిత అశోక్ ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలోని చంద్రుగొండ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా బక్కి కవిత అశోక్ శుక్రవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట కోర్టు ఏజిపి అడ్వకేట్ బండి శివకుమార్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ రావుల తిరుపతిరెడ్డిలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ రథసారధిగా గుర్తింపు పొందిన కవిత అశోక్ గతంలో నెక్కొండ జడ్పిటిసిగా ఎంపిపిగా సేవలందించారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనా అనుభవంతో చంద్రుగొండ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని కవిత అశోక్ స్పష్టం చేశారు. ఆమె సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించడంతో చంద్రుగొండ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

## నాడు కారోబార్ నేడు సర్పంచ్

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన పెద్దగొని నాగరాజు నాడు గ్రామ పంచాయతీ కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. నేడు గ్రామ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన గుగులోత్ స్వప్న విజయ్

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని జేతురాం తండా నూతన సర్పంచ్‌గా సోమవారం గుగులోత్ స్వప్న విజయ్ నాయక్ పదవి బాధ్యతలు చేపట్టారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ రవి నాయక్, వార్డు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్బంగా సర్పంచ్ స్వప్న విజయ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తన లక్ష్యమన్నారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పారు.

## కిష్టాపురం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/రాయపర్తి:** కిష్టాపురం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని గ్రామ సర్పంచ్ కొండం రంగారెడ్డి అన్నారు. సోమవారం కిష్టాపురం గ్రామ నూతన సర్పంచ్‌గా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో పార్టీలకు అతీతంగా ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా పార్టీలకు అతీతంగా తమ కుటుంబం గ్రామ ప్రజలకు సేవలు అందిస్తుందని అన్నారు. గ్రామ ప్రజలకు సేవ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సలహాలు సూచనలు తీసుకొని గ్రామాన్ని అభివృదిధ పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండం కృపాకర్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ క్రమశిక్షణకు కాంగ్రెస్ పెద్ద పీట

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ వారిపై కాంగ్రెస్ పార్టీ కఠిన నిర్ణయం తీసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బిర్రు ఎల్లయ్యతో పాటు పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ రెడ్డబోయిన కుమారస్వామిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకు యాకయ్య వెల్లడించారు. పార్టీ విధానాలు, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఇక నుండి బిర్రు మల్లయ్య, రెడ్డబోయిన కుమారస్వాములకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధాలు ఉండవని అధికారికంగా ప్రకటించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకు యాకయ్య తీసుకున్న ఈ నిర్ణయానికి గ్రామ పార్టీ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో సర్పంచ్ కోలా లక్ష్మణ్, గర్నెపెల్లి సమ్మిరెడ్డి, రామసహాయం ఉపేందర్ రెడ్డి, గర్నెపల్లి రాంరెడ్డి, ఇనుగాల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పార్టీ క్రమశిక్షణ, ఐక్యతే కాంగ్రెస్ బలమని, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడే వారిపై ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజాపక్షంగా పని చేస్తూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

## నెక్కొండ అభివృద్ధికి సరికొత్త బాట



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ పెండ్యాల హరి ప్రసాద్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరిప్రసాద్ దంపతులను శాలువాలతో సత్కరించి, గ్రామాభివృద్ధి పట్ల స్పష్టమైన దిశానిర్ధేశం చేశారు. నెక్కొండ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి నిధుల సాధన కోసం ప్రభుత్వం వద్ద ప్రత్యేక చొరవ తీసుకుంటానని రంజిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దేలా పాలకవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, చల్ల శ్రీపాల్, రాచకొండ రఘు, కొండ సుబ్బారెడ్డి, చల్లా పాపిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దొడ్డ విజయ్, నగర పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం, తదితరులతో పాటు మండలంలోని 39 గ్రామ పంచాయతీల నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం చేయడంతో మండలమంతా పండగ వాతావరణం నెలకొంది.

## ఖానాపురం సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దాసరి రమేష్



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపురం గ్రామ ప్రజల ఆశీస్సులతో పంచాయతీ ఎన్నికలలో దాసరి రమేష్ గెలుపొందారు. ఈ సందర్బంగా స్థానిక ఎంపిడిఓ అద్వైత, సర్పంచ్ దాసరి రమేష్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు కామిశెట్టి లక్ష్మి సుధీర్, గుండ్లపల్లి విజయ్, భూక్య స్రవంతి నవీన్, ఈగపొంగు కొమురయ్య కోటయ్య, ఎండి అజహర్, గుండ్లపల్లి మంజుల నరసింహస్వామిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దాసరి రమేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పార్టీలకే అతీతంగా పాలన అందిస్తానని, గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా నేరుగా గ్రామ పంచాయతీ వేదికగా పరిష్కారం చూపబడతామని, గ్రామంలో నెలకొన్న సమస్యల కోసం ఫిర్యాదుల పెట్టె, రిజిస్టర్ సైతం ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వీటి సమస్య పరిష్కారం కోసం బాధితుల ఇంటికే అధికారులు స్వయంగా వచ్చి పరిష్కారం చేసే బాధ్యత తీసుకుంటామని పాలకవర్గం తరుపున హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సునీల్ కుమార్, పంచాయతీ సెక్రటరీ సుప్రజ, మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ దేవినేని వేణు కృష్ణ, మాజీ సర్పంచ్‌లు ఉమా మహేశ్వరరావు, తక్కళ్ళపల్లి రమేష్, మాజీ ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏకశిల డిజి స్కూల్‌లో ఘనంగా గణితోత్సవం




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఏకశిల డిజి పాఠశాలలో గణితశాస్త్ర వేడుకలు శివనగర్‌లోని ఏకశిల డిజి పాఠశాలలో శ్రీనివాస్ రామానుజన్ పుట్టిన రోజు సందర్బంగా మ్యాథమెటిక్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ భేతి కొండల్ రెడ్డి పాల్గొని రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ అంశాలపై వివిధ ప్రదర్శనలతో గణిత శాస్త్ర అంశాలపై వివరించిన విద్యార్థులను అభినందించారు. రామానుజన్ యొక్క జీవిత చరిత్రను, మ్యాథమెటిక్స్ డే యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఇన్‌చార్జి స్వప్నలత, గణిత డిపార్ట్‌మెంట్ సుధాకర్, నరేష్, దినేష్, భాష్మిని, రేవతి, మౌనిక, సౌజన్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్,బిఆర్ఎస్ కార్యకర్తల గొడవ

**ప్రజాపక్షం /చెన్నారావు పేట :** నూతన పాలకవర్గం చేపట్టిన ప్రమాణ స్వీకారంలోసమయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య కుర్చీలతో దాడులు చేసుకున్న సంఘటన చెన్నారావుపేట గ్రామపంచాయతీలో సోమవారం జరిగింది. ఇదే గ్రామంలో బి ఆర్ ఎస్ బలపరచిన అభ్యర్థి కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి గెలుపొందారు. సర్పంచ్ వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేపడుతున్న బిఆర్ఎస్ పార్టీ పాటలతో డీజేతో మోగిస్తున్నారు. పార్టీ నాయకుల పాటలు ఎలా పాటిస్తారు అంటూ కాంగ్రెస్ కార్యకర్త మందలించగా ఇది మా ఇష్టమని చెప్పడంతో ఇరువు రు వర్గాల మధ్య మాట మాట పెరిగి కూర్చున్న కుర్చీలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా స్వల్ప గాయాల పాలయ్యారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన తక్కళ్ళపెల్లి రవీందర్‌రావు

**ప్రజాపక్షం/ఖానాపూర్:** నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల బిక్షంరెడ్డి తండ్రి నర్సింహారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. కాగా నర్సింహారెడ్డి పార్థివదేహంపై డిసిసి జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్ళపెల్లి రవీందర్ రావు పూలమాల వేసి శ్రద్దాంజలి ఘటించారు. అదేవిధంగా ఖానాపురంకు చెందిన ప్రభుత్వ రిటైర్డ్ టీచర్ శాఖమూరి చిన్న వీరయ్య మృతి చెందగా వీరయ్య పార్థివదేహంపై పూలమాల వేసి శ్రద్దాంజలి ఘటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వీరి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మదర్స్‌ల్యాండ్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నర్సంపేట:** బిఎంఆర్ కరాటే టు అకాడమీ ఆధ్వర్యంలో హన్మకొండ లోని జకరయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పలు రాష్ట్రాల నుండి నాలుగువేల మంది విద్యార్థులు, కరాటే మాస్టర్లు పాల్గొనగా నర్సంపేట మదర్స్‌ల్యాండ్ ఇంగ్లీష్‌మీడియం హై స్కూల్ అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు, వెండి, కాంస్య పథకాలను సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రమేష్ తెలిపారు. కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులై కె. శాన్విత్, రిషి,అప్సాతవ్వకల్, పల్లవి, హర్షిత్ రావు, కీర్తన, శివసాయి బాల బాలికల కటాస్ విభాగంలో అత్యంత ప్రతిభను కనపర్చి బంగారు పతకాలను సాధించగా, సాయి తేజ, వర్షిని, భవిష్య, చరణ్, శ్రీనిధి వెండి పథకాలు సాధించగా, సింధు శ్రీ, మణికంఠ, మణి చంద్ర కాంస్య పథకాలను సాదించారు. పథకాలు సాధించిన విద్యార్థులను, వీరి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ జానీ మాస్టర్ బెస్ట్ కోచ్ అవార్డుగా ఎంపికాకావడంతో వారిని, విద్యార్థులను మదర్స్ ల్యాండ్ స్కూల్ చైర్మన్ రమేష్ , ప్రిన్సిపాల్ నవిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## కొలువుదీరిన కొత్త సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/నల్లబెల్లి(నర్సంపేట):** నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు పదవీ ప్రమాణ స్వీకారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో 29 గ్రామాల్లో ని పంచాయతీ కార్యాలయాల్లో చేశారు . సోమవారం మండలంలో ఘనంగా ప్రమాణ స్వీకారం కార్యక్రమం పంచాయతీ కార్యదర్శులు ఎన్నికైన సర్పంచులు , ఉప సర్పంచులు , వార్డు సభ్యులతో చేయించారు . ఈ సందర్భంగా నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో శుభ నివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు , కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల నాయకులతో గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

## చెరువులను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి

**ప్రజాపక్షం/నల్లబెల్లి,(నర్సంపేట) :** మండల కేంద్రంలోని రేవుల కుంట, వెంకటపాలెం చెరువు భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సంపత్ కు వినతిపత్రం అందించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ చెరువు శిఖం భూములను సైతం ఆక్రమించుకొని వ్యవసాయం చేస్తున్నారు. అదేవిధంగా శిఖం భూములను కబ్జా చేసి ఆక్రమించిన వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్‌సభ్యులు మాసంపల్లి అఖిల్, పరికిత్యాగ రాజు, బూస కుమారస్వామి, వైనాల జంపయ్య, మేకల మోహన్, కోల లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలంలోని 16 గ్రామాలలో సర్పంచు ఎన్నికలు జరిగాయి. సోమవారం రోజున పెంచికలపేట, నీరుకుల్లా, సొల్లపల్లి, కటాక్ష పూర్, హౌస్ బుజుర్గ్, పెద్దాపూర్ అక్కంపేట, నాగయ్య పల్లె, లింగమడుగుపల్లె, కామారం, తిరుమలగిరి, గూడెంపాడు, కొత్తగట్టు గ్రామాల సర్పంచ్ బాధ్యతలను స్పెషల్ ఆఫీసర్ల చేత ప్రమాణ స్వీకారం చేయబడినారు.

## పార్టీలకు అతీతంగా మల్లక్ పల్లి సర్పంచ్‌కి సన్మానం



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** నూతనంగా గ్రామ పంచాయతీకి ఎన్నికైన సర్పంచ్, గిన్నారపు లత రామ స్వామి ఉపసర్పంచ్, వార్డ్ మెంబెర్స్ నీ పార్టీలకు అతీతంగా పుష్పగుచ్చం అందచేసీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపి.టి.సి లు పలు పార్టీల అధ్యక్షులు,కార్యదలు, మాజీ సర్పంచ్ మునిగెల రాజు, నారభోయిన మహేశ్వరి ఎల్లస్వామి, మాజీ.జిపి. చెక్ పవర్ డాక్టర్ శాగంటి శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరపాక ఏలియా, హనుక్, సుదీర్, ప్రశాంత్, టిఆర్ఎస్ అధినేత లు దాసరి రాజేందర్, తదితరులు సన్మానాలు చేసి అభినందించారు.

## అనుమానిత వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** హనుమొండ జిల్లా గూడెప్పాడు సెంటర్లో పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో అటుగా వస్తున్న వాహనదారులు పోలీసులను చూసి తప్పించుకొని ఫ్యాషన్ ప్రో ఏపీ 36 ఏ హెచ్ 6230 మోటార్ సైకిల్ పై పారిపోతుండగా, పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా గతంలో క్రైమ్ నెంబర్ 204/2025 ఆత్మకూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిన వ్యక్తులని గుర్తించారు. ఆ వ్యక్తులను విచారించగా హర్షం అశోక్ గ్రామం నీరుకుల్లా, దాసరి సాగర్ ఎలియాస్ చింటూ హనుమకొండ అని తెలిసినది. వీరిద్దరూ గతంలో ఈ నెల 7న హర్షం రాజ్ కుమార్ గ్రామం నీరుకుల్లా చలివాగు క్రాస్ వద్ద టీ స్టాల్ నడుపుతుండగా అతనిని కర్రలతో, రాడ్లతో కొట్టి తప్పించుకున్న వ్యక్తులని తెలిసినది. గతంలో ఆర్షం అశోక్ కొంతమంది దగ్గర లోను ఇప్పిస్తానని 40 వేలు తీసుకొని, లోను ఇప్పించకుండా, ఇచ్చిన డబ్బులు ఇవ్వకుండా అడుగుతున్న వారిని బెదిరిస్తూ ఈ క్రమంలో ఆర్షం అశోక్ తన మిత్రులతో కలిసి రాజకుమార్ను కొట్టడం జరిగినదని పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసిన, తప్పించుకుని తిరుగుతున్నారని ఆత్మకూరు సిఐ సంతోష్ తెలిపారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ లష్కర్ బజార్ లోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాక్టిసింగ్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, టాలెంట్ టెస్ట్, గణిత మేలా, రంగోళి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రధానోపాధ్యాయులు వి. జగన్నాథం చే అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాధిక, ఎస్. మాధవి, సిహెచ్ రజిత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలుగుదీరిన పంచాయతీ పాలక వర్గాలు



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో సోమవారం పంచాయితీ నూతన పాలకవర్గాలు సోమవారం ప్రమాణస్వీకారం చేపట్టాయి. ఈ సందర్భంగా మండలకేంద్రంతో పాటు మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులు మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బానో,ఉప సర్పంచ్ తుంగల శ్రీజ,అలాగే మండలంలోని కన్నెపల్లి సర్పంచ్ వెన్నపురెడ్డి సంజీవ రెడ్డి,ఉప సర్పంచ్ శ్రీరాముల రాజయ్య,పెద్దంపేట సర్పంచ్ బీసుల లావణ్య,ఉపసర్పంచ్ గడ్డం రాజాగౌడ్,కుదురుపల్ల సర్పంచ చల్ల సమ్మిరెడ్డి,ఉప సర్పంచ్ అమురాజి యశోద,మద్దులపల్లి వేల్పుల సరిత,ఉప సర్పంచ్‌పెప్పిరెడ్డి లచ్చన్న,సూరారం మేకల శంకరమ్మ,ఉప సర్పంచ్ చల్ల చిన్నన్న,ఎడపల్లి లీలా రాణి,ఉప సర్పంచ్ గోగుల రాజముద్దుకృష్ణ,పలుగుల విజయలక్ష్మి ,ఉసర్పంచ్ చెంద్రయ్య,ఏన్కపల్లి పర్శబోయిన నిర్మల,ఉపసర్పంచ్ సిగినేని శ్రీనివాస్,ఎల్కేశ్వరం పల్లె రాజయ్య,ఉప సర్పంచ్ రాళ్లబండి మల్లయ్య,చంద్రుపల్లి గుర్సింగ బాపు,ఉపసర్పంచ్ ఆలం స్వర్ణలత,అంబట్‌పల్లి గుజ్జుల లావణ్య,ఉప సర్పంచ్ పోలం సంజీవ్,బెగ్లూర్ ఆకుల రాజయ్య,ఉపసర్పంచ్ చెల్లూరి సదానంద చారి,బొమ్మాపూర్,చీర్ల చంద్రశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ వెన్నపు రెడ్డి సురేందర్,కాళేశ్వరం మోహన్ రెడ్డి,ఉప సర్పంచ్ చీమల సుధీర్ కుమార్,బ్రాహ్మణపల్లి పేట లత,ఉప సర్పంచ్ పిడుగు నాగరాజు,అన్నారం నీర్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ పర్శవేని సమ్మయ్య ప్మాణస్వీకారం చేసారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,నాయకులు భాను ప్రకాష్,వర ప్రసాద్,వామన్ రావు,యువ నాయకులు రాఘవేంద్ర,మేసినేని రవిచందర్,దాగం సంతోష్,నెన్నెల గట్టయ్య,చిటికేసి చక్రదర్,జగదీశ్వర్,సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమారస్వామి కుటుంబ సభ్యులకు సిపిఐ జిల్లా నాయకుల పరామర్శ




**ప్రజాపక్షం/కమలాపూర్ :** హనుమకొండ మండలం గుండ్ల సింగారం భూ పోరాట కమిటీ సభ్యులు పూజారి కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం ఆయన స్వగ్రామం అయిన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మరియు నాయకులు పూజారి కుమారస్వామి గారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం పూజారి కుమారస్వామి భార్య దేవమ్మను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మాట్లాడుతూ పూజారి కుమారస్వామి మృతి బాధాకరమని అన్నారు. వారి కుమార్తెకు, కుటుంబ సభ్యులకు సిపిఐ తరుపున ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నామని, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. పూజారి కుమారస్వామి కుటుంబ సభ్యులను, వారి సోదరులను పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

## ఆదర్శ పాఠశాలలో గణిత ప్రయోగశాల ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరులో గల ఆదర్శ పాఠశాలలో డిసెంబర్ 22 శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఆదర్శ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గణిత ప్రయోగశాలను మండల విద్యాధికారి వద్దు కటింగ్. సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా గణిత ప్రయోగశాలలో గణితానికి సంబంధించిన వివిధ రకాలైన ఎగ్జిబిట్స్ మరియు పజిల్స్ విద్యార్థులు ప్రదర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ట్రెజర్ హంట్, గణిత గుర్తుల తో తయారు చేసిన రంగోలి ఆకట్టుకొన్నాయి. అలాగే రామానుజన్ సంఖ్య 1729 ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ సునీత ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ నిజజీవితంలో గణిత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సమావేశంలో గణిత ఉపాధ్యాయులు ఆచరిత, రవీందర్ రెడ్డి, వెంకట్, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

## జిడబ్ల్యూఎంసి నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇంటి నిర్మాణం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కాకతీయ యూనివర్సిటీ దగ్గరలోని దుర్గా నగర్ రోడ్డు నంబర్ 5లో పలవేల్పుల రోడ్డు భీమారంలో గల టప్పర్ మెంట్ సమీపంలో ఇంద్రసేనారెడ్డి అనే వ్యక్తి తన స్థలంలో జీడబ్ల్యూఎంసీ పర్మిషన్ లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు కాలనీ వాసులు నగరపాలక సంస్థ కమిషనర్ కు వి పిర్యాదు చేశారు.దాంతో పాటు 30 ఫీట్ల దారిని ఆక్రమిస్తూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని పిర్యాదు చేశారు. ఇట్టి విషయంలో తమ కాలనీవాసులందరం పనికి అడ్డుపడితే మమ్ములను బెదిరింపులకు గురి చేస్తున్నారని కమిషనర్ కు ఇచ్చిన వినతిపత్రం లో తెలిపారు.ఇట్టి విషయంపై స్థానిక కార్పొరేటర్ కు, అదేవిధంగా కేయూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందవి,అయినా తన పని ఆపకుండా కొనసాగిస్తున్నారని,ఈ ఆక్రమణ కారణంగా రహదారి వెడల్పు తగ్గి నివాసితులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఇట్టి విషయంపై అధికారులు తగు పరిశీలన చేసి తమకు న్యాయం చేయగలరని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆర్బిట్ ఇ-టెక్నో స్కూల్లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హనమకొండ లోని ఎల్లాపూర్ శివారు లోని ఆర్బిట్ ఇటెక్నో స్కూల్ లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ వారసత్వాన్ని గౌరవిస్తూ జాతీయ గణిత దినోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించింది.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి, డైరెక్టర్ హరికా భగవాన్ రెడ్డి హాజరై, పాఠశాల గణిత అధ్యాపకులు వాసుదేవ రెడ్డి, రాజేష్, వెంకటేష్, స్వర్ణలత చేసిన కృషిని ప్రశంసించారు.ఈ వేడుకలో ఇంటరాక్టివ్ ససెషన్ల, క్విజ్‌లు,100కు పైగా విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలు ప్రదర్శితమయ్యాయి. గణితం అనేది కేవలం సబ్జెక్టు మాత్రమే కాదని, వాస్తవిక సమస్యలను పరిష్కరించే సాధనం అని చిట్టిరెడ్డి భగవాన్ రెడ్డి అన్నారు. తమ విద్యార్థులను తార్కికతను, సృజనాత్మకతను అందుకోవాలని ప్రోత్సహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం ఆర్బిట్ ఇటెక్నో స్కూల్ విశ్లేషణాత్మక మేధస్సును పెంపొందించే నిబద్ధతను మరింత బలపరిచింది.

## పల్లె ప్రగతికి ప్రతిన.. కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

**ప్రజాపక్షం/సంగెం:** మండల వ్యాప్తంగా గ్రామాల్లో నూతన అధ్యాయం మొదలైంది. గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చడమే లక్ష్యంగా, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయని రీతిలో పాలన అందిస్తామని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రతినబూనారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధికారులు మరియు గ్రామస్తుల సమక్షంలో దైవసాక్షిగా ప్రమాణం చేసిన నూతన పాలకవర్గ సభ్యులు.. తమ గ్రామాల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా, ఐకమత్యంతో గ్రామాలను ‘ఆదర్శ గ్రామాలు’గా తీర్చిదిద్దుతామని, మౌలిక వసతుల కల్పనలో రాజీపడబోమని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్థానిక పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మరమ్మతులకు నూతన సర్పంచ్ శ్రీకారం

**ప్రజాపక్షం/కమలాపూర్:** మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో చాలా రోజులుగా గేట్ వాల్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నూతనంగా ఎన్నికైనా గ్రామ సర్పంచ్ మిట్టపల్లి రాజేశ్వరి కుమారస్వామి నూతన వార్డు సభ్యుల సమక్షంలో కొత్త గేటు వాల్ ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధి పనులకు పాలకవర్గం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామ ప్రజల, పాలకుల సహయ, సహకారాలతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు పంచాయతీ సెక్రటరీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన కొత్త పాలకవర్గం

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నికైనా సభ్యులు ప్రత్యేక అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడివో బాబు మాట్లాడుతూ... ఎన్నికైనా ప్రజా ప్రతినిధులు తమ స్వార్థ ప్రయోజనాలకు కాకుండా గ్రామం అభివృద్ధి చెందే దిశగా పనిచేయాలని సూచించారు. గతంలో కంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి వారి పాలనలో జరిగిన అభివృద్ధి చిరుకాలం గుర్తుండే విధంగా చేసినప్పుడే పాలకులకు శాశ్వతంగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అదే విధంగా అన్ని గ్రామాలలో సర్పంచులుగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజల సమక్షంలో అన్నారు. అధికారులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు పాలకులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ మండలం ఎంపీయూపీఎస్ గోపాలపురం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాలు జరపడం జరిగింది. అందులో భాగంగా విద్యార్థులచే గణిత టిఎల్ఎం తయారు చేసి గణిత మేళాను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ప్రమీల, శ్రీధర్, సుమత, గీతాంజల, కోమలాదేవి, రజనీ గార్లు, ఛాత్రోపాధ్యాయులు మరియు విద్యారులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపిన డిసిసి అధ్యక్షురాలు

**ప్రజాపక్షం/జనగామటౌన్:** జనగామ జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులు గ్రామాలభివృద్ధికి నిరంతరం పనిచేయాలి

**ప్రజాపక్షం/కొడకండ్ల:** కొడకండ్ల గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన దూలం మమత సతీష్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కొడకండ్ల గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై, పార్టీ బలపర్చిన అభ్యర్థిపై ఉంచిన విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, గ్రామ ప్రజల సమస్యలను ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాల్సిన భాధ్యత ఉందన్నారు. గ్రామంలో ఐక్యత, సమైక్యతతో ముందుకు సాగుతూ, పార్టీ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా పాలన సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలి

**ప్రజాపక్షం/జనగామ :** ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఓటర్ల మ్యాపింగ్‌పై ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వయించి మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి రోజు నిర్ధారించుకున్న మేకు గరిష్ట గడువులోపు పూర్తి చేయాలన్నారు. ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలను అందరు పాటిస్తూ వారం రోజుల్లో ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితాలో బ్లర ఫోటో గ్రాప్, స్మాల్ ఫోటో గ్రాప్, ఇంప్రాపర్ ఫోటోగ్రామ్, ఫారం 8 ద్వారా అసలైన ఫోటోగ్రాఫ్ సేకరించి సమీకరించాలన్నారు. ఈ ప్రక్రియ జనవరి 2026లోపుగా పూర్తి చేయాలన్నారు.

## కొలువు దీరిన నూతన సర్పంచులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల మండలంలోని 32 గ్రామపంచాయతీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో సోమవారం రోజున ప్రభుత్వ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపికైన సర్పంచులు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి




**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్ పూర్ :** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల, బండ్లగూడెం, రఘునాథపల్లి మండలం కంచనపల్లి, స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కొత్తగా ఎన్నికైన సర్పంచులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవినీతి అక్రమాలకు దూరంగా నీతి నిజాయితీతో పని చేసినప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతారని సూచించారు. గ్రామ అభివృద్ధి విషయంలో నూతన సర్పంచులకు తోడుగా ఎమ్మెల్యేగా తాను, ఎంపీతో పాటు ప్రభుత్వం ఉంటుందని, గ్రామాలలో నూతన సర్పంచులు అభివృద్ధి పనులు చేయడానికి ఇది మంచి అవకాశం అని తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పినట్టుగా ప్రతీ గ్రామానికి అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కొత్త సర్పంచులు గ్రామ సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసి గ్రామంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 27,28 తేదీలలో ఉచిత కృత్రిమ కాలు పంపిణీ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** పరికిపండ్ల నరహరి,ఐఏఎస్ స్థాపించిన ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్ ట్రస్ట్ వారి సౌజన్యంతో దివ్యాంగుల కోసం ఉచిత కృత్రిమ కాలు (ఆర్టిఫిషియల్ లింబ్) పంపిణీ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం డిసెంబర్ 27,28 తేదీలలో వరంగల్‌లో కొత్తవాడ, ఎం.వి. కాలనీ, పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ప్రాంగణంలో జరగనుంది. ప్రమాదాలు, వ్యాధులు లేదా ఇతర కారణాల వల్ల కాలు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న దివ్యాంగులకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన దివ్యాంగులకు పూర్తిగా ఉచితంగా నాణ్యమైన కృత్రిమ కాళ్లు అమర్చనున్నారు.ఆలయ ఫౌండేషన్ విద్య, వైద్య మరియు ఉపాధి రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో సేవాభావంతో ముందుకు సాగుతోందని నిర్వాహకులు తెలిపారు. దివ్యాంగులు స్వతంత్రంగా జీవించేందుకు, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆలయ ఫౌండేషన్ సభ్యులు సీఈవో రమేష్ బాబు,అడిషనల్ సీఈవో రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈఓ కీర్తి నాగార్జున, మట్ట రాజు, పరికిపండ్ల వేణు, గాజుల్లా సంపత్, కుసుమ సతీష్ బాబు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, మంత్రి లింగమూర్తి, ఎలగం చిన్న కొమురయ్య పేర్కొన్నారు.నమోదు మరియు ఇతర వివరాల కోసం 9490133650, 9885981959, 9949446802, 7095915728 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమాజంలోని దివ్యాంగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవితాల్లో కొత్త వెలుగు నింపుకోవాలని ఆలయ ఫౌండేషన్ విజ్ఞప్తి చేసింది.

## మిత్ర కార్పొరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్ :** మిత్ర కార్పొరేషన్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరంగల్ ఉర్సు, కడిపికొండ రోడ్డులోని సాయినాథ్ ఎంక్లేవ్‌లో మిత్ర కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగింది. గత రెండు సంవత్సరాలకు సంబంధించిన కార్యదర్శి నివేదికను ప్రధాన కార్యదర్శి నోముల సదానందం,ఆదాయ వ్యయాల నివేదికను కోశాధికారి కాసం రాజు సభ్యుల ముందు ప్రవేశ పెట్టగా కొన్ని సవరణలు,సలహాలు, సూచనలతో ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ 2010 సంవత్సరంలో ప్రారంభించిన మిత్ర కార్పొరేషన్ సభ్యుల సహకారంతో 15 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం శుభ పరిణామమన్నారు. ఆర్థిక అభివృద్ధికి కార్పొరేషన్ ఎంతగానో దోహద పడుతుందని,పొదుపుతో కుటుంబ అవసరాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నూతన కమిటీకి అధ్యక్షులుగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్,ఉపాధ్యక్షులుగా జడల లక్ష్మి నారాయణ,ప్రధాన కార్యదర్శిగా నోముల సదానందం,ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాదారపు రాము,కోశాధికారిగా కాసం రాజు,కార్యవర్గ సభ్యులుగా దూదాటి శ్రీనివాసులు,సరస్వతిభట్ల సతీష్ లు ఎన్నికయ్యారు. కార్పొరేషన్ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ అభిప్రాయపడింది.ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి పాటుపడతాం

**ప్రజాపక్షం/పరకాల/నడికూడ :** గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తామని సర్పంచులు శపథం చేశారు. సోమవారం పరకాల,నడికుడ మండలాలలోని సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామ సర్పంచ్ గా మహేందర్, పోచారం గ్రామపంచాయతీ సర్పంచ్ గా పెంతెల మధుకర్ రెడ్డి, వెంకటాపురం గ్రామ సర్పంచ్ గా రాజేశ్వరరావు, నాగారం గ్రామ సర్పంచ్ గా ఏరుకొండ రమాదేవి, లక్ష్మి పురం గ్రామ సర్పంచ్ గా పల్లవైన గీతారాణి ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా నడికూడ మండలంలోని నడికుడ మండల కేంద్రమైన నడికుడి గ్రామ సర్పంచ్ గా కుడ్లే మలహాలరావు, కంటాత్మకూరు గ్రామ సర్పంచ్ గా తిరుపతి, రామకృష్ణపురం గ్రామ సర్పంచ్ గా పెండ్లి లక్ష్మి , కౌకొండ గ్రామ సర్పంచ్ గా ఓదెల శ్రీలత భాస్కర్ పంచాయతీ కార్యాలయం తరలివచ్చిన ప్రజల మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా గ్రామానికి చెందిన సర్పంచులు ప్రమాణ స్వీకారాన్ని ఎంతో అడ్డహాసంగా నిర్వహించారు బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీతో కలిసి వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు కొత్తగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం సర్పంచులు ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జులైవాడ ప్రభుత్వ పాఠశాలలో గణిత దినోత్సవం

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జులైవాడలో ప్రముఖ గణిత భారతీయ శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం గణిత దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు గణితం పై రూపొందించిన 45 నమూనాలను ప్రదర్శించారు. అనంతరం గణితంపై నిర్వహించిన క్విజ్ పోటీలో విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొడారి భాస్కర్ రెడ్డి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం గణిత ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో గణితం ప్రాముఖ్యతను సంతరించుకున్నదని, గణితంలో నిష్ణాతులయితే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత పదవులను పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు గజ్వేల్లి పూర్ణచందర్, నల్ల అమితా దేవి, పాఠశాల, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన నూతన పాలక వర్గం

**ప్రజాపక్షం/వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని 14 గ్రామాలలో రెండవ విడుత ఎన్నికలలో బాగంగా గెలుపొందిన సర్పంచ్‌లు,వార్డు సభ్యులు సోమవారం ఆయా గ్రామాలలో సర్పంచ్‌లుగా,వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఆయాగ్రామాల వారిగా పూర్తివివరాలు 1) వేలేరు మండలకేంద్రంలో బిల్ల యాదగిరి2) శాలపల్లిలో కూరపాటి అశోక్,3)లోక్యతండలో మురావత్ సాంబయ్య,4) మద్దెలగూడెంలో హనుమకొండ మనోజ్ 5) చింతల తండలో మాలోతు రాజు ,6)బండతండలో మాలోతు అరుణనాగరాజు 7) గొల్లకిష్టంపల్లిలో బత్తుల శ్రీనివాస్,8) పీచరలో మరిజె అనితనర్సింగారావు,9) మల్లికుదుర్లలో జక్కుల మౌనికసంపత్ యాదవ్,10) సోడశపల్లిలో వెన్నం రమాదేవిసంపత్‌రెడ్డి,11) కమ్మరిపేటలో జోడుముంతల కిరణ్,12) గుండ్లసాగర్‌లో ధండ్లసాగర్‌లో మానసశివ 13) ఎర్రబెల్లిలో కాలేరు శ్రావణ్,14)కన్నారంలో జన్నె రవిందర్‌లను ఆయాగ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, గ్రామకార్యదర్శుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు కార్యక్రమంలో తహశీల్దార్ హెచ్ కోమి, లక్ష్మి ప్రసన్న. పశువైద్యాధికారి నోముల రణధీర్‌రెడ్డి ఆయాగ్రామాల మాజీప్రజాప్రథినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడిచెట్టుపైనుండి వ్యక్తికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రానికి చెందిన గుజ్జేటి కనుకయ్య రోజువారిగా విధినిర్వహణలో బాగంగా కల్లు గీయడంకోసం తాడిచెట్టు ఎక్కి కల్లుగీసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి క్రింద పడిపోవడంతో వెన్నెముకకు,మెడకు బలమైన గాయాలు కాగా 108 సిబ్బందికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఇఎంటి దినేష్,పైలెట్ దయాకర్ సోమవారం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించడం జరిగింది.

## గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బచ్చన్నపేట గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నూతన సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు అన్నారు.సోమవారం గ్రామస్థుల సమక్షంలో సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 14 వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా గ్రామపంచాయతీ తనకు సమాచారం అందిస్తే దాన్ని పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైరు రజిత, వార్డు సభ్యులు, గ్రామస్థులు, కాంగ్రెస్‌పార్టీ సీనీయర్ నాయకులు బాలకిషన్‌గౌడ్, ఎండి.గౌస్, బుచ్చయ్య, బాలరాజు, సిద్దులు, మహాత్మాచారి, పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసిన నూతన సర్పంచ్

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల మండలంలోని పెద్ద తండా గ్రామ నూతన సర్పంచ్‌గా భాద్యతలు చేపట్టిన గుగులోత్ రాధా కొక్యా నాయక్ పాలకవర్గం అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన హామిలో భాగంగా పెద్ద తండా గ్రామపంచాయతీలో యువతకు క్రీడా మైదానం ధాన్యం కొనుగోలు కేంద్రానికి 25 గుంటలు భూదానం చేసారు.ఈ సందర్భంగా ఆయన సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తానని, గ్రామ అభివృద్దే తన ధ్యేయమన్నారు.పెద్దతండాకు యువతకు క్రీడా మైదానం ధాన్యం కొనుగోలు కేంద్రానికి 25 గుంటలు భూదానం చేసిన సర్పంచ్ రాధా కొక్యానాయక్‌ను గ్రామస్థులు అభినందించి హర్షం వ్యక్తం చేసారు.

# కొలువు దీరిన గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో 25 గ్రామ పంచాయితీలలో సోమవారం నూతన పాలక వర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆయా గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు పంచాయితీ సర్పంచ్, ఉపసర్పంచ్ లతో పాటు వార్డు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ పాలక వర్గం ప్రమాణ స్వీకారంలో అధికార కాంగ్రెస్, బిఆర్ ఎస్, బిజెపిల మధ్య కొంత సేపు రసబస చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్ మేజర్ సర్పంచ్‌గా బిఆర్ఎస్ మద్దతుతోభారీ మేజార్టీతో గెలుపొందిన పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ డిజె సౌండ్‌తో ఎంఎల్‌సి యాదవరెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలతో భారీ ర్యాలీగా గ్రామ పంచాయితీ కార్యాలయానికి చెరుకుని సర్పంచ్ ఛాంబరో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాయితీ కార్యాలయం ముందు ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాటు చేసిన సభ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో సభ స్థలిలో బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులకు ముందు వరుస,అధికార కాంగ్రెస్,బిజెపి పార్టీ వార్డు సభ్యులకు వెనుక వరుసలో కుర్చీలు ఏర్పాటు చేయడంతో ఇరు వర్గాల మధ్య అలజడి చోటు చేసుకుంది. దింతో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలు చేసుకోవడంతో ఒక సారిగా సభ స్థలం ఉద్రిక్తంగా మారింది. కొందరు సభ్యులు కుర్చీలు లేపి బహాబహీకి దిగడంతో ఘర్షణ వాతవరణం చోటు చేసుకుంది. పోలీసుల రంగప్రవేశంతో ప్రశాంత వాతావరణం ఏర్పడటంతో డిఎల్‌పిఒ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.



# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా



**ప్రజాపక్షం/బెజ్జంకి:** గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధికి తోడ్పడుతానని దాచారం గ్రామ సర్పంచ్ బైర మానస సంతోష్ తెలిపారు.సోమవారం గ్రామ పంచాయితీ కార్యాయంలో ఎంపిఓ మంజుల ఆధ్వర్యంలో నూతన గ్రామ సర్పంచ్‌గా పాలక వర్గ సభ్యులతో కలిసి పదవి భాధ్యతలు చేపట్టారు.ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని అవి కేవలం ఎన్నికల వరకు మాత్రమేనని అన్నారు.గ్రామంలోని ప్రజలంతా ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి ఉండి గ్రామా భివృద్ధికి తోడ్పడాలని అన్నారు.నన్ను నమ్మి ఆశీర్వదించి గ్రామ సర్పంచ్‌గా అవకాశం ఇచ్చిన మీకు రుణపడి ఉంటానని తెలి పారు .గ్రామంలోని ఇండ్లు లేని నిరుపేదలకు ఎలాంటి పక్ష పాతం లేకుండా ఇండ్లు మంజూరు చేయించే భాధ్యత తను కుంటానని అంతే కాకుండా మహిళా సంఘ భవనం,అంగన్వాడీ కేంద్రాలు అతి త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తానని అన్నారు .రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,లద్దబండ ముంపుకు గురైన ప్రజలకు ప్రభుత్వం నుండి రావలసిన పరిహారాన్ని అందించేందుకు స్థానిక ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులతో పాటు ప్రహరి గోడ నిర్మాణా నికి, పారిశుద్ధ సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూల్మిట్ట విద్యార్థులు

ధూల్మిట్ట ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సిద్దిపేట జిల్లాలో ఇటీవల నిర్వహించిన జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ మరియు సెలెక్షన్‌లో ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ జిల్లా సెలెక్షన్ మరియు పోటీలలో ధూల్మిట్ట పాఠశాల బాలుర జట్టు ప్రథమ స్థానాన్ని, బాలికల విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు ధూల్మిట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌లు తెలిపారు. ఇందులో బాలుర విభాగంలో ఎంపికైన కొండూరి కొండూరి శ్రీరామ్ సాత్విక్, వశికర్, రిత్విక్, కార్తీక్, సాత్విక్, రాహుల్, సంజయ్‌లు ఎంపికయ్యారని, బాలికల విభాగంలో రిధిక, శృతి, సంజన, కొండూరి ప్రణతి, హర్షిని ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు ఈ నెల 24 నుండి 29 వరకు మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో నిర్వహించనున్నట్లు, ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్ తెలిపారు. చదువుతో పాటుగా ఆటల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నా పాఠశాల విద్యార్థులను, ప్రోత్సహించి ఉత్తమమైన శిక్షణలతో ముందుకు తీసుకపోతున్న ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డిలను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



# ఘనంగా మండలంలో నూతన సర్పంచ్‌ల ప్రమాణ స్వీకరణ మహోత్సవం

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల కేంద్రంలో నూతన గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన బొల్లం శ్రీధర్ (పెద్దన్న) సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఎంపిడిఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో పాలక వర్గ సిబ్బందితో కలిసి ప్రమాణ స్వీకరణ చేశారు.అంతే కాకుండా ఆయా గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పంచాయితీ కార్యాలయాల్లోని కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డు సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకరణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి పదవి భాధ్యతలు చేపట్టారు.ఈ సంధర్భంగా నూతన సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

# ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** శ్రీనివాస్ రామానుజన్ జన్మదిన సందర్బంగా తాటిపల్లి లోనియునైటెడ్ పాఠశాల యందు గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులు చేసినటువంటి గణిత ప్రాజెక్టుల్ని సందర్శించారు. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (1887డిసెంబర్ 221920ఏప్రిల్ 26 (1) బ్రిటీష్ పరిపాలనా కాలంలో భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శుద్ధ గణితంలో ఈయనకు శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ , సంఖ్యా శాస్త్రం , అనంత శ్రేణులు ,ఆవిరామ బిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశాడు. అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలను కూడా ఇతనుపరిష్కారం కనుగొన్నాడు. ఈయనలోని గణిత పరిశోధన ప్రవృత్తి ఏకాంతంలోనే ఎక్కువగా అభివృద్ధి చెందింది. తన పరిశోధనలతో అప్పట్లో ప్రఖ్యాత గాంచిన గణిత శాస్త్రవేత్తలకు దగ్గరవ్వాలని ప్రయత్నించారు. 1913 లో ఆయన ఇంగ్లాండులోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేసే జిహెచ్‌హార్డీ అనే గణిత శాస్త్రవేత్తను ఉత్తరాల ద్వారా సంప్రదించారు. రామానుజన్ ప్రతిపాదించిన చాలా కీలకమైన సిద్ధాంతాలని కొన్నైతే రాను కని విని ఏరుగని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ఇందులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రదానోపాధ్యాయులు తాటిపల్లి మల్లేశం, బహుమతులు అందజేశారు. ఇందులో వారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల్లో కొలువు దీరిన కొత్త పాలక వర్గాలు

జిల్లాలో 508 సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లుగా ప్రమాణస్వీకారం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలోని 508 గ్రామ పంచాయతీల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. జిల్లాలోని 508 గ్రామపంచాయతీల్లో కొత్తగా గెలుపొందిన 50 8సర్పంచ్‌లు,508, ఉప సర్పంచ్‌లు,4508 వార్డు స భ్యలను గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు రా జ్యాం గా బద్దంగా ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాలో గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట, హుస్నాబాద్ నియోజక వర్గాలతో పాటు, జనగాం నియోజక వర్గం పరిధిలోని చే ర్యాల,కొముర వెల్లి. దూల్మిట్ట, మద్దూరు, మానకొండూరు నియోజక వర్గం పరిధిలోని బెజ్జంకి మండల పరిధిలోని 508 గ్రామ పంచాయతీల్లో నూతన పాలక వర్గాలు కొలువుదీరాయి. కొత్తగా గెలుపొందిన సర్పంచ్‌లకు గ్రామంలోని కొత్త సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామంలోని ప్రధానంగా పారిశుధ్యం. తాగునీరు, మురికికాల్వల నిర్మాణం. రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను పరిష్కారించాల్సిన బాధ్యత కొత్త పాలక వర్గంపై ఉంటుంది. కొత్త పాలక వర్గం గ్రా మాభివృద్ధి, ప్రజల సమస్యలే పరిష్కారమే ఏజెండగా పనిచేయాల్సి ఉంటుంది. అవినీతికి తావు లేకుండ నిజాయితీగా ప్రజాస్వామ్య బద్ధంగా పాలన అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# ఉత్సవంగా నూతన సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలంలోని గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులు సోమవారం ఉత్సవంగా ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి సర్పంచ్‌గా చింతల శ్రీనివాస్‌యాదవ్,ఉపసర్పంచ్ మమత కిషన్,ఎన్సాన్‌పల్లి సర్పంచ్‌గా నాగుల స్రవంతి ప్రశాంత్,మందపల్లి గ్రామ సర్పంచ్‌గా పన్యాల అర్చన శ్రీనివాస్‌రెడ్డి,ఐక్రిచెప్యాల సర్పంచ్‌గా జక్కుల శ్రీలత శ్రీనివాస్,నాంచార్‌పల్లి పురుమాండ్ల నర్సింహారెడ్డి,పొన్నాల సర్పంచ్‌గా అమ్ముల వెంకటయ్య,ఉప సర్పంచ్‌గా ధారబోయిన సృజన సంపత్‌యాదవ్,ఎల్లుపల్లి సర్పంచ్‌గా పూల బాలక్రిష్టారెడ్డి,బూర్గుపల్లి సర్పంచ్‌గా సడిమెల పద్మబాలయ్య,తడ్కపల్లి సర్పంచ్‌గా తొడంగుల వెంకటేశ్,కిష్టసాగర్ సర్పంచ్‌గా మౌనిక నరేందర్‌రెడ్డి,పొందవపురం సర్పంచ్‌గా అంది శంకర్,వెల్కటూర్ సర్పంచ్‌గా బొల్లు లక్ష్మిలు ఆయా గ్రామాల ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులతో కలిసి ప్రమాణస్వీకారం చేసి పదవీబాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఆయా గ్రామాలకు కేటాయించిన అధికారులు వారిచే ప్రమాణస్వీకారం చేయించారు.



# కొలువు దీరిన కొత్త పాలన, నేటితో తీరనున్న ప్రజల కష్టాలు

**ప్రజాపక్షం / హుస్నాబాద్:** గత రెండు ఏళ్లుగా ప్రత్యేకాధికారుల చేతిలో ఉన్న గ్రామ పరిపాలన నేడు నూతన సర్పంచులతో నూతన పాలక వర్గం నేటి నుండి అధికారంలోకి వచ్చింది . హుస్నాబాద్ నియోజకవర్గంలో 7 మండలాల్లోని నూతనంగా ఎన్నికైన సర్పంచులు , ఉపసర్పంచులు , వారుండ సభ్యులు సోమవారం ప్రత్యేకఅధికారులచే ప్రమాన స్వీకరణ మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులుప్రజాతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నా రు.అందరి సహకారంతో అభివృది చేస్తామని అన్నారు.

# గ్రామ పంచాయతీలలో కొలువైన నూతన సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/దుబ్బాక:** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన ప్రజాప్రతినిధులు సోమవారం తమ బాధ్యతలను స్వీకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాలలో గ్రామ పంచాయతీ ప్రజల సమక్షంలో సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. దుబ్బాక, తొగుట, దౌల్తాబాద్, అక్బర్‌పేట భూంపల్లి, రాయపోల్ మండలాల్లో సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. దుబ్బాక మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్, ఉప సర్పంచులతో పాటు వార్డు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేపించారు. అనంతరం సర్పంచులు తమ కుర్చీలలో ఆసీనులై బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గుర్రాల శ్రీనివాస్, పద్మనాభునిపల్లి సర్పంచ్‌గా అరుణరాజేశంలు బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని బొప్పాపూర్ గ్రామ సర్పంచ్‌గా భాను ప్రసాద్ బాధ్యతలు స్వీకరించి, గ్రామంలో పూర్తిగా మద్యపాన నిషేధిస్తున్నట్లు ప్రకటించారు.



# ప్రజావాణి పిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

## నేటి ప్రజావాణికి 17 వినతులు

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులకు ప్రాదాన్యత నిచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అదనపు కలెక్టర్ మాదురి, డిఆర్ఓ పద్మజ రాణిలతో కలిసి ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. జిల్లాలోని నలు మూలల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు ,పిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆర్జీదారుల నుండి వినతులు స్వీకరిస్తూ వారితో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు. సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అదికారులు మరింత చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిద సమస్యలపై వచ్చిన వినతులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించ గలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 17 ఆర్జీలు రాగా వాటిని సంబందిత శాఖలకు తగిన చర్యలను పంపారు. జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, పిడిడిఆర్డిఓ జ్యోతి , ఆర్డీఓలు ,రెవెన్యూ ,పోలీసు పంచాయతీ రాజ్, వ్యవసాయం , విద్యహౌసింగ్ ,వైద్య ఆరోగ్యం ,ఇంజనీరింగ్ ,సంక్షేమ శాఖల జిల్లా అధికారులు ,మున్సిపల్ కమీషనర్లు తది తర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారి పనుల్లో వేగం పెంచండి

## ఎంపి. ఎమ్మెల్యే ఆదేశాలు

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** మదీనా గూడ నుండి సంగారెడ్డి చౌరస్తా వరకు చేపడుతున్న 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు మంద కొడిగా సాగుతున్నాయని పటాన్చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాతీయ రహదారుల సంస్థ అధికారులపై మండి పడ్డారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిదిలోని ఆర్ అండ్ బి గెస్ట్ లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలసి జాతీయ రహదారులు సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

### ప్రజలకు తాగునీటి సమస్య

బిహెచ్ఈఎల్ నుండి రుద్రారం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు మందగించడం వల్ల రోజువారి లక్షలాది మంది ప్రయాణికులు ట్రాపిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇస్నాపూర్ ,లక్దారం, రుద్రారం, తదితర గ్రామాల పరిధిలో మంచి నీటి పైపులైన్లు ద్వంసం కావడంతో కాలనీలకు మంచి నీటి సరపరా నిలిచిపోయిందని ,తాగునీటి కొరత తీవ్రమవుతోందన అసహనం వ్యక్తం చేశారు. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోడంపై అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు.

**నాణ్యత లేని నిర్మాణాలుః** వర్షపు నీటి నిస్కాసన కోసం సర్వీస్ రోడ్డుపై నిర్మిస్తున్న కాలువల ,నాణ్యత , సరిగా లేదని ,ప్రాంబానికి ముందే కూలిపోతున్నాయని తెలిపారు. విస్తరణ పనుల్లో వేగం పెంచకపోతే రాబోయే రోజుల్లో మరిన్ని సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. మరో నెల రోజుల్లో మళ్లీ సమావేశమై



పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని అదికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జాతీయ రహదారుల సంస్థ డిఈ రామకృష్ణ, ట్రాపిక్,సీఐ లాలు నాయక్, విద్యుత్‌శాఖ, డీఈ భాస్కర్, వివిద శాఖల అధికారులు ,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గడీల శ్రీనివాస్ గౌడ్ గొల్లపల్లి సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం




**ప్రజాఫక్షం/కొండాపూర్ :** మండల పరిధిలోని గొల్లపల్లిలో నూతన పంచాయతీ కార్యవర్గం కొలువు దీరింది. ప్రమాణ స్వీకార మహోత్సవంలో బాగంగా సోమవారం మండల పరిధిలోని గొల్లపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో మండల గ్రామ పరిపాలన అదికారులు సమక్షంలో గొల్లపల్లి సర్పంచ్ గా గడీల శ్రీనివాస్ గౌడ్ ,ఉప సర్పంచ్‌గా బంటు ప్రియాంక ,నర్సింలు, వార్డు సభ్యులుగా మన్నె రామయ్య ,మన్నె ఎల్లయ్య, కుమ్మెర శ్రీకాంత్, వడ్డేపల్లి ప్రమీలా సుదర్శన్ గొల్ల శ్రీకాంత్ ,బంటు సత్యనారాయణ ,ఆన్వర్ ఆస్మా బేగం, కొత్త గాడి, నవనీత, వీరారెడ్డి గోసుల శ్రీకాంత్ వార్డు సభ్యులుగాప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నూతన పంచాయతీ కార్య వర్గ సభ్యులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నాయకుడిగా కాదు సేవకుడిగా పని చేస్తా

### కాసాల సర్పంచ్ కోటంల వెంకటేష్



**ప్రజాఫక్షం/హత్నూర :** హత్నూర మండలం కాసాల గ్రామంపచాయతీ పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం పండగ వాతావరణంలో జరిగింది. ప్రత్యేకాదికారి సర్పంచ్ కోటంల వెంకటేష్ ఉపసర్పంచ్‌గా గంపల కిష్టయ్య, ఆయా వార్డులకు సంబందించిన వార్డు సభ్యులకు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ నాయకుడిగా కాకుండాసేవకుడిలా గ్రామానికి సేవా చేస్తా అన్నారు. తన మీద నమ్మకంతో తనను కాసాల గ్రామ సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు విద్యవంతులకు ,ఉద్యోగుస్తులకు ,యువకులకు హృద్యపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంది కావున నాయకులు ఆవుల రాజీరెడ్డి, సహకారంతో గ్రామానికి అవసరమైన పని చేస్తా అన్నారు.

## 120 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ

**ప్రజాపక్షం/గజ్వేల్:** సామాజిక సేవలో తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని ట్రస్టు చైర్మన్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. సోమవారం తలకోక్కుల చంద్రకళ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ లో 120 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 10 ఏండ్లుగా తమ ట్రస్టు గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతి, పేదల సంక్షేమం వంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. తాము చిన్న చిన్నతనంలో పడిన కష్టాలు నేటి తరం గ్రామీణ విద్యార్థులు పడొద్దనే లక్ష్యంతో చేతనైనంత సహాయం అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్, నిర్వాహకులు దుర్గాప్రసాద్, మధుసూదన్, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, సరోజినీ దేవి, శోభారాణి, డాక్టర్ కృష్ణ కాంత్, మణికాంత్, సతీష్, దేవుల పల్లి రాజారాం, ఆడెపు బాలచంద్రం కృష్ణమూర్తి, తుమ్మ నర్సింలు, శ్రీనివాస్, దూడం శ్రీరాములు, సూరం లింగం, స్వర్గం చంద్రం, పాశికంటి శ్రీనివాస్, గాడిపల్లి జయ, విజయ్, మాదాసు జగదీశ్వర్, చెప్యాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కొలువు దీరిన కొత్త సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/గజ్వేల్:** వర్గల్ మండలంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వర్గల్ మేజర్ పంచాయతీ సర్పంచ్ గా దేవగనిక జయ భారతి బాధ్యతలు చేపట్టారు. అలాగే మీనాజీపేట సర్పంచ్ గా కీసర వెంకటేష్, మల్లారెడ్డిపల్లి సర్పంచ్ గా దాసరి విజయలక్ష్మి యాదగిరి, మజీద్ పల్లి సర్పంచ్ గా లింగ చెన్నయ్య, శాకారం సర్పంచ్ గా మొహమ్మద్ సయ్యద్, సామలపల్లి సర్పంచ్ గా భాస్కర్ రెడ్డి, గోవిందా పూర్ సర్పంచ్ గా భూంరెడ్డి, అవుసులోని పల్లి సర్పంచ్ గా రాజకుమార్, శేరి పల్లి సర్పంచ్ గా పావని మోహన్ రెడ్డి, నాచారం సర్పంచ్ గా సారిక యాదగిరి, గౌరారం సర్పంచ్ గా కనకరాజు, అనంతగిరి పల్లి సర్పంచ్ గా రవికుమార్, వేలూరు సర్పంచ్ గా ఎల్లవ్వ, సీతారాం పల్లి సర్పంచ్ గా కుక్కల అండాలు రాము, అంబర్ పేట సర్పంచ్ గా భాగ్యలక్ష్మి కుమార్, తునికి ఖల్సా సర్పంచ్ గా కొండగళ్ల గణేష్, గిర్మాపూర్ సర్పంచ్ గా విజయలక్ష్మి, నెంటూరు సర్పంచ్ గా నాగరాజు, మైలారం సర్పంచ్ గా బూరుగుపల్లి మల్లేష్, సింగాయపల్లి సర్పంచ్ గా సురేందర్, మాదారం సర్పంచ్ గా కౌసర్ పర్వీన్, దండుపల్లి సర్పంచ్ గా కలకుంట్ల సుజాత కృష్ణ, చౌదర్ పల్లి సర్పంచ్ గా లింగ రవి, జబ్బాపూర్ సర్పంచ్ గా నల్ల వెంకటేష్, తునికిమక్త సర్పంచ్ గా స్వామి తదితరులు స్పెషల్ ఆఫీసర్ల నుండి బాధ్యతలు స్వీకరించారు.

# 100 వీకెండ్ వండర్ ఆఫ్ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** 100 వీకండ్ ఎండర్స్ ఆఫ్ తెలంగాణ పేరుతో వినూత్న పోటికి సంబందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,జిల్లా యువజన క్రీడా టూరిజం అధికారి ఎం ఖాసీం బేగ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అద్భుతమైన ఎవరికి తెలియని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తెచ్చేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని దాగ ఉన్న పర్యాటక అందాలను పోటోలు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారిక భారీ నగదు. బహుమతులు అందిచనున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు వచ్చే పర్యటకుల కోసం వారి అభిరుచికి తగ్గటు కస్టమ్ టూర్స్ పేరుతో సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఐటి ఉద్యోగులు, విద్యార్థులు ,కుటుంబాలు, వారంతాల్లో వెళ్లేందుకు కొత్త ప్రదేశాలను అన్వేషిస్తుంటారని తెలిపారు. ఈ నేఫథ్యంలనే 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పేరుతో ఒక పోటీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పెద్దగా తెలియని జలపాతాలు ,పురాతన దేవాలయాలు, ట్రిక్కింగ్




పాయింట్లు వంటి 100 కొత్త గమ్యస్థానాలను గుర్తించి వాట వివరాలతో ఒక కాపీ బుక్ రూపొందించడమన ఈ పోలీ లక్ష్యం ,. 10 విబాగాల్లో ఎంట్రీలు ,నేచర్ , వైల్డ్ లైప్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ ,వాటర్ బాడీస్, వంటకాలు, పామ్ స్టేస్ రిసార్ట్ స్పించువల్ అడ్వేంచర్ వంటి 10 విబాగాల్లో ఎంట్రీలు, పంపవచ్చునని తెలిపారు. ఎంచుకున్న ప్రదేశానికి సంబందించి 3 మంచి పోటోలు 60 సెక్షన్ల వీడియో ,ఆ ప్రదేశానిక రవాణా ,బస బడ్జెట్ వివరాలతో కూడిన 100 పదాల సమాచారాన్ని గూగుల్, ఫామ్ , సోషల్ మీడియాలో ఈమ అకౌంట్లకు ఫస్ట్ ప్రైజ్ రూ. 20 వేలు ఇవ్వడం జరుగుతుందని , కన్సోలేషన్ బహుమతులుగా హరిత హోటల్ లో ఉచిత బస కల్పించడం జరుగుతుందని ,ఆసక్తి ఉన్న వారు జనవరి ఐదవ తేదిలోపు ఎంట్రీలు, పంపాలని తెలిపారు. సంక్రాతికి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. www.tourism. telangana.gov .in వెబ్ సైట్‌ను సంప్రదించవలసిందిగా తెలిపారు.

## గ్రామంలో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార వేడుకలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార వేడుకలను గ్రామస్తులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ లు స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామస్థులతో కలిసి హనుమాన్ దేవాలయంలో వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ముస్తాబైన పంచాయతీ కార్యాలయాలు




**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతలలో కోలాహలంగా ముగిసాయి. అల్లాదుర్గం మండలంలో 16 గ్రామ పంచాయతీలకు కొత్తగా ఎన్నికైన సర్పంచులు వార్డు మెంబర్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలో సదుద్దేశంతో సోమవారం గ్రామపంచాయతీలు ప్రమాణ స్వీకారం ఎంపీడీవో పేద ప్రకాశ్ రెడ్డి పంచాయతీ సెక్రెటరీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నేరుగా కేంద్ర నిధులు

## బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్ గౌడ్

**ప్రజాపక్షం/గజ్వేల్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా కేటాయిస్తున్నట్లు జిల్లా బిజెపి అధికార ప్రతినిధి నందన్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం నాచారం సర్పంచ్ సారిక యాదగిరిని సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేయాల్సిందేనని, ఇందులో ఎలాంటి సందేహాలు ఉండవని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు నేతృత్వంలో బలోపేతం అవుతుండగా, వచ్చే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలుపొందడం శుభ పరిణామం కాగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

# గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా :చంద్రం కృష్ణ గౌడ్



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో సోమవారం నూతనంగా గెలుపొందిన సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ తన పాలకవర్గంతో గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ ప్రత్యేక అధికారి తహ ల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గాన్ని అభిమానులు, గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషులు ,నాయకులు, కార్యకర్తలు, మిత్రులు మిఠాయి తినిపించి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్ర కృష్ణ గౌడ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలంద రికీ రుణపడి ఉంటానని గ్రామ సమస్యలే తన ఎజెం డాగా పాలకవర్గం సహాయ సహకారాలతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఇదివరకే కొంతమేరకు నీటి సమస్య తీర్చ మని మిగిలిన వాటిని గుర్తించి త్వరలో తీరుస్తారని సభాముఖంగా హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో ఎన్ని కలు జరుగుతాయని సర్పంచిగా గెలిచేది గ్రామ పౌరు డైనని తనకు ఎలాంటి భేదం లేకుండా పార్టీలకతీ తంగా గ్రామ అభివృద్ధి చేస్తానని అన్నారు. రాజకీ యాలు ఎన్నికలప్పుడే గాని ఫలితాల అనంతరం అభి వృద్ధి మీదనే దృష్టి సారిస్తానని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్న గ్రామ ప్రథమ పౌరుడిగా నేనున్నానని భరోసా కల్పించారు .గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తానని మిగతా సమస్యలను గుర్తించి దశలవా రీగా అందరి సహాయ సహకారాలతో పూర్తి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలన్నారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేత మల్లి కార్జున్ గౌడ్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశం, మాజీ కో ఆప్షన్ నెంబర్ హైమద్, గ్రామ పెద్దలు చంద్రం దుర్గ గౌడ్, సత్యనారాయణ గౌడ్, పుండ్రికం గౌడ్, పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు రాజకీయ ప్రముఖులు, కుల సంఘాల నేతలు, గ్రామ ప్రజలు యువకులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రముఖ భార తీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామాను జన్ జయంతి సందర్భంగా డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవాన్ని నిజాంపేట మండల కేంద్రం లోని పీఎం శ్రీ జిల్లా పరి షత్ హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ వాస్త వ్యులు పాఠశాల విద్యార్థి గణిత ప్రొఫసర్ సిబిఐటి ప్రొఫసర్ డాక్టర్ జిటి. నర్సింలు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను మరియు గత ప్రాజెక్ట్ ల ప్రదర్శన ను వారు తిలకించి విద్యార్థు లను అభినందించారు. అనంతరం పాఠ శాల తరపున ఆయనను శాలువాతో సత్క రించారు. ఈ సందర్భంగా ప్రొఫసర్ నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులు గణిత అభ్యసనం పట్ల విజ్ఞాన కలిగి ఉండి నూతన అంచనాలతో సృజనాత్మకతలో నేర్చుకోవా లని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు మహేందర్, ఉపాధ్యా యులు రామ్మోహన్ శర్మ, రవీందర్ రెడ్డి, దేవయ్య, రజిత,శిరీష, మరియు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** పొలంలో ఉంచిన గడ్డిమోపులు అనుమానస్పదంగా మంట లలో కాలి బూడిదైన ఘటన మండలంలోని లింగోజిగూడతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం లింగోజిగూడతండాకు చెం దిన మోగావత్ నంద కుటుంబం వ్యవసా యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండాశివారులో పిల్లుట్ల చౌరస్తా దాటిన తరువాత నర్సాపూర్ వెల్దుర్తి ప్రధాన రహదా రిని ఆనుఒని ఉన్న తన సొంత పొలంలో నంద వరి గడ్డిమోపులను ఒక చోట వా ముగా పేర్చి నిల్వ ఉంచాడు. రోజుమాదిరి గానే పొలంలో నుంచి ఇంటికి వచ్చిన నం ద కుటుంబసభ్యులు రాత్రికి అన్నం తిని ని ద్రించిన తరువాత అర్ధరాత్రి నందకోడలు లేచి చూడగా గడ్డివాము మంటలకు తగిలి పోతు కనిపించడంతో పరుగున అందరు అక్కడు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అప్పటిపే అగ్ని ఆహుతైపోయా యని, సుమారు లక్షరూపాయల నష్టం వాటిల్లిందని, బాధితులు విలపిస్తూ తెలి పారు. ఇటీవలే జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో మేము మద్దతు తెలుపలేదనే తండాఉ చెందిన కొందరు వ్యక్తులు కక్షగట్టి గడ్డివాములను తగులబెట్టారని నంద కుటుంబసభ్యులు ఆరోపించారు.

# ఘనంగా సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారోత్సవం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల వ్యాప్తంగా సోమవారం మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో నూతనంగా ఎన్నిక అయినటువంటి సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గ్రామాల స్పెషల్ అధికారుల ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యు లచే ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన అభ్యర్థులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం విధేయత చూపిస్తానని ప్రమాణం చేసి గ్రామంలో ఉన్నటువంటి సమ స్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామ స్తులు కూడా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు గా ఉండాలని గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులు కూడా తమవంతు పూర్తి సలహా సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో స్పెషల్ అధికారులు శ్రీనివాస్, రాజిరెడ్డి,బిక్షపతి, రమ్యశ్రీ, సోమలింగారెడ్డి, శ్రీనిధి, యాదగిరి,శ్రీనివాస్, సర్పంచులు నాతి అంజమ్మ,అందే కొండల్ రెడ్డి, చల్మేటి నరేందర్, బొమ్మన మల్లేశం, రామచంద్రనాయక్, పాతూరీ భాను ప్రకాష్ రెడ్డి, ముత్యాల సరిత, అంతంపల్లి సుశీల, మంగిలిపల్లి మంజుల, చిన్నమనేని శైలజ, పొన్నబోయిన ప్రవీణ్, బత్తుల స్వప్న, ఆకుల శేరి స్వప్న, ఓజ్జా కనకరాజు, మాడావత్ సునీత, రమావత్ బాబు నాయక్, వివిధ గ్రామాల కార్యదర్శిలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూరు మండలంలో ప్రారంభమైన ప్రమాణస్వీకారాలు

### గూడూరు మండలంలో 41 మంది సర్పంచ్‌లు
### 41మంది ఉపసర్పంచ్‌లు 354 మంది వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం 41 గ్రామపంచాయతీలో 41 మంది సర్పం చ్‌లు 41 మంది ఉపసర్పంచ్‌లు 354 మంది వార్డుసభ్యులు ఆయా స్పెషల్ ఆఫీసర్ల ద్వారా ప్రమాణ స్వీకారం చేసి పదవి భాధ్యతలను చేపట్టడం జరిగింది.ఉదయం 9 గంట లకు ప్రారంభమైన ప్రమాణస్వీకారాలు ఆయా గ్రామాల్లో అట్టహాసంగా జరిగింది. గ్రామ పెద్దలు గ్రామంలోని యువత పెద్ద ఎత్తున గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వచ్చి నూతన పాలకవర్గాన్ని ఆశీర్వదించారు.ముఖ్యంగా అనేక గ్రామపంచాయతీలో యువత పెద్ద ఎత్తున పోటి చేసి గెలవడంతో సర్పంచ్‌లుగా ఉపసర్పంచ్‌లుగా వార్డుసభ్యులుగా పదవి భాధ్యతలు చేపట్టడంతో గ్రామాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తిం చేశారు.సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌లు 354మంది వార్డుస భ్యలు స్పెషల్ ఆఫీసర్లు కార్యదర్శిలు ప్రమాణ స్వీకారం చేపీయడం జరిగింది. ఈసందర్భంగా సందర్భంగా సంత కాలు చేసి ప్రజలు తమకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని హామీ ఇవ్వడం జరిగింది.ఇందులో భాగంగా పోనుగోడు గ్రామ సర్పంచ్ బానోత్ సనీత బాస్కర్ ఉపసర్పంచ్ బోల్లికొండ మమతా మధు మాట్లాడుతూ మానుకోట ఎమ్మెల్యే సహ కారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపి స్తామని అన్నారు. ముఖ్యంగా పరిశుభ్రమైన వాతావర ణాన్ని కల్పిస్తూ సిసిరోడ్లు మంచిపీటి సౌకర్యం వీధీ ధీపాలు లాంటివి ఎప్పటికప్పుడు పర్యవేక్తిస్తూ గ్రామాలు అభివృద్ధి కోరకు పనిచేస్తామని అన్నారు.

## పోలీస్ బందోబస్తు మధ్య దామరవంచ సర్పంచ్‌గా సూజాత ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/గూడూరు;** ఎట్టికెలకు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సనుప సూజాత పోలీసుల బందోబస్తు మధ్య ప్రమాణస్వీకారం చేశారు.నిన్న వెలువడిన ప్రజా పక్షం నేనంటే నేను సర్పం,చ్ అనే శీర్షికలో దామరవంచ గ్రామ సర్పంచ్ అనే శీర్షికలో దామరవంచ గ్రామ సర్పం చిగా టీఆర్ఎస్ పార్టీకి నూనవత్ స్వాతి మొదట మూడు ఓట్లతో గెలిచిందని రిటర్నింగ్ ఆఫీసర్ విజమ ఇచ్చిందని మరల అధికార పార్టీ కాంగ్రెస్ బలవంతంతో మళ్లీ రీ కౌంటింగ్ చేపించి సునప సూజాతను సర్పంచ్‌గా ఎన్నిక చేస్తూ ధ్రువపత్రాన్ని ఇవ్వడం జరిగింది.అయితే ఈవిష యంలో రిటర్నింగ్ ఆఫీసర్ విజయ తాను టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన స్వాతికి ఎటువంటి సర్పం,చ్ ఎన్నిక ధ్రువప త్రాన్ని ఇవ్వలేదని దానిని ఫోర్జిరీ చేశారంటూ గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు.దీంతో టిఆర్ఎస్ నాయకలు ఆందోళన చేపడుతారని ఉద్దేశంతో ముందు స్తుగా పోలీసులు స్వాతీని పిలిపించి ఏదైనా ఉంటే కోర్టులో సమస్యను పరిష్కరించుకోవాలని ప్రమాణస్వీకారానికి ఎలాంటి అటంకాలు కలింగించిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

## కొలువుదీరిన నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గాలు



**కేసముద్రం/ప్రజాపక్షం:** కేసముద్రం మండలంలోని అన్నారం గ్రామ పంచాయతి నూతన సర్పంచ్‌గా విజయం సాధించిన బండి పృధ్వీరాజ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్ద తుతో విజయం సాధించాడు. అతి చిన్న వయస్సులో గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నిక కావడం విశేషం. ప్రజా అవస రాలు గుర్తించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్నారం గ్రామాన్ని ప్రభుత్వ నిధులతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ధడానికి పనిచేస్తానని తెలిపాడు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలు స్వీకరించారు.

# బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు

### గ్రామ అభివృద్ధి ద్యేయంగా పనిచేస్తాం



**ప్రజాపక్షం/పాపన్నపేట:** గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. సోమ వారం మండల పరిధిలోని 40 గ్రామపంచాయతీలలో సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు చే అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారానికి గ్రామపంచాయతీలు కు నూతన ముస్తాబ్ చేయించారు. ప్రమాణ స్వీకారానికి గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో తరలిరాగా, వారి సమక్షంలోనే ప్రమాణ స్వీకారం చేశారు. పాపన్నపేటలో ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో డీఎల్పిఓ సురేష్ బాబు, స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో విష్ణువర్ధన్ పాల్గొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన నూతన పాలకవర్గం అను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, అవినీతి రహితంగా, అభి వృద్ధి బాటగా ముందుకెళ్లాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

## కొలువుదీరిన కొత్త సర్పంచులు



**ప్రజాపక్షం/రామాయంపేట:** నూతనంగా ఎన్నికైన సర్పంచులు సోమవారం పదవీబాద్యతలు చేపట్టారు. రామాయంపేట మండలం లోని 16 గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులచే ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ప్రమాణ స్వీకారం చేయిం చారు. కోనాపూర్ సర్పంచు కిచ్చయ్యగారి వెంకటరామిరెడ్డి, ప్రగతి ధర్మారం సర్పంచు బండారి శ్రీనివాస్‌గౌడ్, శివ్వాయిపల్లి సర్పంచు మమత, సుతారిపల్లి సర్పంచు మద్దూరి సునీల్, ఆర్.వెంకటాపూర్ సర్పంచు వెంకుగారి ఉమా సంజీవరెడ్డి, దామరచెరువు సర్పంచు దుంపల గీతాంజలి, అక్కన్నపేట సర్పంచు బక్కయ్యగారి యాదగిరి, ఝాన్సీలింగాపూర్ సర్పంచు మానెగల్ల రామకిష్టయ్య, తొనిగండ్ల సర్పంచు మల్లన్నగారి శివకుమారి నాగులు, లక్ష్మ పూర్ సర్పంచు గొల్లపల్లి నవీన్‌గౌడ్, కాట్రియాల సర్పంచు కొత్త స్రవంతి రాజేందర్, పర్వతాపూర్ సర్పంచు కాట్రోత్ తార్యానాయక్, జమ్లాతాండా సర్పంచు బన్సీనాయక్, దంతెపల్లి సర్పంచు మస్కూరి బాల్‌రాజ్, కిష న్‌తాండా చావ్లారాణి, రాయిలపూర్ సర్పంచుగా గట్టు సుశీలలు పదవీ బాద్యతలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## కొలువుదీరిన నూతన సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** గ్రామపంచాయతీలకు కొత్త పాలకమండలీలు సోమ వారం కొలువుదీరాయి. ఈనెల 17 న ఎన్నికలలో గెలిచినప్పటికి ప్రభుత్వ ఉత్త ర్వుల ప్రకారం సోమవారం ప్రమాణస్వీకరాలు జరిగాయి. అల్లీపూ ర్‌లో పిట్ల కుమార్, కొత్తపేటలో లింగరబోయిన రాములు, లింగోజి గూడలో బాసంపల్లి అమృత, పిల్లుట్లలో బుర్ర మురళీగౌడ్, రత్నాపూ ర్‌లో కండెగారి ఆంజనేయులు, తిమ్మాపూర్‌లో గునంగారి రాజు, చిన్నగొట్టిముక్కలలో సింగాయపల్లి నారాయణరావు, టిక్యదేవమ్మగూ డలో లకావత్ తేజశ్విని, చెన్నాపూర్‌లో ఆకుల కొమురయ్య, పెద్దగొ ట్టిముక్కలలో మోకాళ్ల నవీన్, గోమారంలో కుమ్మరి హైమావతి, బిజిలీ పూర్‌లో దంతాన్‌పల్లిలో గజేంద్రుల మమత, పోతులబొగుడలో కొ ల్చెల్మె పుష్ప, పాంబండలో నాయిని సమతరెడ్డి, భీమ్లతండాలో లక్ష్మి దుర్గ్య, ఉసిరికపల్లిలో నవారు సుజాతరెడ్డి, ఏదుల్లాపూర్‌లో కల్లూరి హనుమంతరావు, మగ్దుంపూర్‌లో సోముకృష్ణవేణి, చెందిలో గైనిబైటి ప్రవీణ్‌గౌడ్, శివ్వంపేటలో రాజిపేట వెంకటేశ్వర్, గూడురులో బేగరి నర్సయ్య సర్పంచ్‌లుగా ప్రమాణస్వీకారం చేశారు.

# రైల్వే డిపో తరలిపోకుండా ఎంపి ప్రయత్నం చేయాలి

## ఎంపిని కలిసిన అఖిపక్షనేతలు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైల్వే డిపో ఎక్కడికి తరలకుండా మహబూబాబాద్ లోనే ఏర్పాటు అయ్యేలా ఎంపి బలరాం నాయక్ ముందుండి ముమ్మర ప్రయత్నం చేయాలని కోరిన అఖిలపక్ష నేతలు నేడు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ని క్యాంపు కార్యాలయంలో రైల్వే డిపో సాధనకై అఖిల పక్షం మరియు ప్రజా సంఘాల నేతలు కలవడం జరిగింది ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు బి విజయ సారధి, సాధుల శ్రీనివాస్ ,డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాస్, మండల వెంకన్న, కొండపల్లి రామ చంద్రరావు, దార్ల శివరాజ్, పిల్లి సుధాకర్ ,గుగ్గిళ్ళ వీరయ్య లు ఎంపీతో మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే డిపో ఉండేలా చూడాలని మానుకోట నుండి ఎక్కడికి పోకుండా ఎంపీ ముమ్మర ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా ఢిల్లీలో మరియు హైదరాబాద్లో పెద్దలతో సంప్రదింపులు జరిపి మానుకోట లోనే ఉండే విధంగా చూడాలని అన్నారు జిల్లా కేంద్రం మరియు పార్లమెంట్ కేంద్రం అయిన మానుకోట జిల్లా కేంద్రంలో ఏ పరిశ్రమ లేదని బయ్యారం ఉక్కు పరిశ్రమ రాలేదని మరియు ఇతర పరిశ్రమలు కూడా రాలేదని రైల్వే డిపో తప్పని సరిగా ఈ ప్రాంతంలోనే వచ్చే విధంగా కృషి చేయాలని ఎంపీ బలరాంనాయక్‌ని కోరారు. ఈ సందర్భంగా గట్టి ప్రయత్నం ఎంపీ చేయాలని అఖిలపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం మానుకోట లోనే రైల్వే డిపో వచ్చే విధంగా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి, రైల్వే మంత్రి



ల దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడే ఉండే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు బి అజయ్ సారధి రెడ్డి, గుణగంటి రాజన్న, ఆకుల రాజు, పెరుగు కుమార్ ,రేశపల్లి నవీన్ ,చింతకుంట్ల వెంకన్న, ఎండి ఇక్బాల్ , భీమా నాయక్, ఎండి ఫరీద్, హరి నాయక్, గోపాల్, ప్రేమ్ చంద్ వ్యాస్, శ్రీను పాల్గొన్నారు.

## కొలువుదీరిన నూతన పాలకవర్గం

### గ్రామాభివృద్ధి,

### ప్రజా సమస్యలపై నిరంతర కృషి

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామ పంచాయతీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గం కొలువుదీరింది. కాళేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని పంచాయతీ ప్రత్యేక అధికారి కృష్ణ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సర్పంచ్ గా వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి,ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకారంలో భాగంగా నూతన సర్పంచ్ మోహన్ రెడ్డి ప్రమాణం చేస్తూ, వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి అను నేను కాళేశ్వరం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నుకోబడిన నేను నా కర్తవ్యాన్ని గ్రామాభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం,పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరంగా కృషి చేస్తానని అదే విధంగా బాధ్యతాయుతమైన నిర్మాణాత్మక భూమిక పోషించి ఎల్లవేళలా తన సహాయ సహకారాలను గ్రామ ప్రజలకు అం దిస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం నూతన సర్పంచ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించిన గ్రామ ప్రజలకు తాను ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఈ సం దర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం ఉప స ర్పంచ్ చెమ్మాల సుధీర్,వార్డు సభ్యులు రేవెల్లి రాకేష్,నిట్టూరి మహేష్, షేక్ రహీమాబాబా, వెన్నపురెడ్డి విజయ లక్ష్మి రేవెల్లి మమత, లేతకరి కవిత, పెద్ది లక్ష్మీ, సయ్యద్ ఇమ్రాన్, పానెం సంతోష్, కావేరి జయలక్ష్మి, బొల్లం రాజశేఖర్ లు ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ సాయి, సిబ్బంది, భారీగా తరలివచ్చిన గ్రామ ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.



## టిఎస్‌యూటిఎఫ్ కన్నాయిగూడెం మండల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/కన్నాయిగూడెంః** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుర్రెవులలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యూటిఎఫ్) మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ములుగు జిల్లా అధ్యక్షులు పోడంచమ్మ హాజరై మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్ డిఏలు విడుదల చేసి పిఆర్‌సి ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం టిఎస్ యూటిఎఫ్ కన్నాయిగూడెం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా



ర్యాకల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా వంగ పాపయ్య, ఉపాధ్యక్షులుగా ఈసం విజయ్, కాటయమున, కోశాధికారి పి శివరామకృష్ణ, కార్యదర్శులుగా వై అనిత, జె ప్రజ్ఞ, ఎం వీరస్వామి, అశోక్‌లు ఎన్నికయ్యారు.

# గ్రామాలలో కొలువుదీరిన సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/ములుగుః** జిల్లాలో 146 సర్పంచ్‌లు, ఉపసర్పంచ్ సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరారు. అలాగే 1290 మంది వార్డు సభ్యుల మీరు కూడా గ్రామ పంచాయతీలో కొలువుదీరారు. మీరందరూ గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేసి ప్రజల్లో అభివృద్ధి ధ్యేయంగా ఉండే విధంగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. సోమవారం నుండి ఐదు సంవత్సరాల వరకు గ్రామాల అభివృద్ధి కొరకు ప్రజలకు అండదండగా ఉండి గ్రామ అభివృద్ధి చేసే విధంగా చూస్తామని సర్పంచ్‌లు అన్నారు. అలాగే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి అధిక సంఖ్యలో సర్పంచ్‌లు గెలిచి మంత్రి సీతక్క మెచ్చే విధంగా అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచ్‌లు గెలవడం జరిగింది. సీతక్క జిల్లా అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి



ఇప్పటి వరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టి జిల్లాలో అభివృద్ధి చోటు చేసుకునే విధంగా అభివృద్ధి జరిగిందని జిల్లా ప్రజలందరికి తెలిసిందే. అందువలన ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి అధిక సంఖ్యలో సర్పంచ్‌లు వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లు అందరూ గెలిచి జిల్లాలో ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఇప్పటి నుండి గ్రామ ప్రజలకు అండదండగా ఉండి గ్రామ అభివృద్ధి కొరకు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులందరూ తోడ్పడే విధంగా ఉంటామని వారు అన్నారు.

## బుర్రకాయల గూడెం ఆదర్శ గ్రామాంగా తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని బురకాయగూడెంను ఆదర్శ గ్రామంగా నూతన సర్పంచ్ తుమ్మల సంపత్ తీర్చిదిద్దాలని మాజీ జెడ్పిటిసి మోటపోతుల శివ శంకర్ గౌడ్ పేర్కొన్నారు. బుర్రకాయల గూడెం గ్రామ సర్పంచ్ గా తుమ్మల సంపత్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా విజయం సాధించారు. దీంతో మాజీ జెడ్పిటిసి ని సర్పంచ్ సంపత్ సాదరంగా పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అతిథిగా పిలవడంతో పెద్ద మనసుతో గ్రామానికి వెళ్లి నూతన సర్పంచి సంపదను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామ నూతన సర్పంచ్ సంపత్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలందరూ మాజీ జెడ్పిటిసి శాలువాలతో సన్మా



నించి తమకు సలహాలు సూచనలు అందించాలని కోరారు. మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ, గ్రామస్తులందరూ ఐక్యమత్యంతో ఉంటూ గ్రామ అభివృద్ధికి అందరూ పాటు పడాలని సూచించారు. చిన్న గ్రామపంచాయతీని అందరు కలిస్తే అభివృద్ధి పథంలో మండలంలో ముందంజలో తీసుకెళ్లవచ్చునాని అన్నారు.

### ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతాం

**ప్రజాపక్షం/వాజేడు :** మండలంలోని ఎడ్జెర్లపల్లి పంచాయతీని అభివృద్ధి పథంలో ఆదర్శ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతామని శనివారం అన్నారు. వాజేడు మండల కేంద్రం లోని బిజెపి పార్టీ వాజేడు మండల అధ్యక్షులు పెద్ది జగపతిబాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశం ముఖ్య అతిథులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మ, జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మొన్న జరిగిన



స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించిన ఏడుజర్ల పల్లి పంచాయితీ సర్పంచు అట్టం మమతా ప్రమాణస్వీకారం మహోత్సవంలో భాగంగా సర్పంచ్ గా, వార్డ్ మెంబర్లా గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత 11 సంవత్సరాలుగా పంచాయతీలోని ఫైనాన్స్ నిధులను నరేంద్ర మోడీ ఇస్తున్నారని తెలియజేశారు.

## కొలువుదీరిన నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గాలు



**ఇనుగుర్తి/ప్రజాపక్షం :** ఇనుగుర్తి మండలంలోని చిన్న ముప్పారంలో గ్రామ పంచాయితి నూతన సర్పంచ్‌గా విజయం సాధించిన రాయిలి భవాని శేఖర్, ఉప సర్పంచ్‌గా మల్లం పెద్ద అయిలయ్య, పెద్ద తండ(సిఎం)లో సర్పంచ్‌గా బానోత్ రేణుక నరేష్, ఉపసర్పంచ్‌గా బాదావత్ శిరీష జగన్‌లు, వార్డు సభ్యులతో కలిసి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజా అవసరాలు గుర్తించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామాలను ప్రభుత్వ నిధులతో తీర్చిదిద్దడానికి పనిచేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాపక్షం, తొర్రూరు :** గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానున్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన గణితి ప్రయోగశాలను ఎంఈఓ బుచ్చయ్యతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.లక్ష్మి నారాయణ ప్రారంభించారు.ఇలాంటి ప్రయోగశాలను ఏర్పా టు చేసిన గణిత ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను అభినదించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను ప్ర దానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు కె.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎం.లింగమూర్తి, ఎండి.షహనాజ్ బేగం, సీహెచ్.కవిత, ఎండి.జావేద్, ఉపాధ్యాయులు యాకస్వామి, చంద్రమౌళి, యాదవరెడ్డి, శ్రీనివాస్, జ్యోతి, శంకర్, ప్రవీణ్‌రెడ్డి, సోమనాదరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాడు ఎంపిటిసిగా నేడు సర్పంచ్ గా ప్రమాణం స్వీకారం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** లింగాల గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ గా ఎన్నికైనా మొగిళిపళ్ళి రవీందర్ ప్రమాణం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిషన్ భగీరథ ఏఈ నవీన్ కుమార్ ప్రమాణం చేయించారు అనంతరం సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డుమెంబర్లను శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా ఏఈ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలతో ఉంటూ ప్రజల మధ్యన ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రజా సేవ చేయాలని అన్నారు నూతనంగా ఎన్నికైనా సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మొగిళిపల్లి రవీందర్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామా అభివృద్ధికి అందరి సహకారంతో పారదర్శకంగా పని చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రమాణంతో ప్రజాసేవకు ఆరంభం అభివృద్ధికి కొత్త అడుగు

### పస్రా సర్పంచ్ భూక్యసుమలత

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** సోమవారం రోజున పస్రా గ్రామ పంచాయతీలో నూతన సర్పంచ్ ల గా ఎన్నికైన సర్పంచ్ భూక్యసుమలత ఉప సర్పంచ్ పదవికి సప్పిడి సంజనగా అలాగే వార్డు సభ్యులు ప్రమాణం చేశారు. నూతన సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు మెంబర్లను శాలువాతో సత్కరించారు పుష్పగుచ్చం అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని సూచించారు నూతన సర్పంచ్ భూక్య సుమలత మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామ అభివృద్ధికి అందరి సహకారంతో పారదర్శకంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.